మృతులకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

రంజాన్ విందు మిగిల్చిన విషాదం

- డీసీఎంను వెనుక నుంచి ఢీ కొట్టిన కారు.. ముగ్గురి మృతి
- రంజాన్ విందు ముగించుకుని ఇండ్లకు వెళ్తుండగా ఘటన
- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శ

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 12 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు ఫ్లైఓవర్‌పై గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. డీసీఎంను అతి వేగంతో వెనుక నుంచి వచ్చిన కారు అదుపు తప్పి ఢీకొట్టడంతో అందులో ప్రయాణించే నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు చనిపోగా మరొక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాద వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ నబీద్ (26), వెన్న నిఖిల్‌రెడ్డి (25), గుండగాని రాకేశ్ (26), చందు నలుగురు స్కూల్, కాలేజ్ స్నేహితులు. గురువారం రాత్రి మహ్మద్ నబీద్ తన స్నేహితులకు రంజాన్ విందు ఇచ్చాడు. విందు అనంతరం తన స్నేహితులను వారి ఇండ్ల వద్ద దించేందుకు మహ్మద్ నబీద్ తన షిఫ్ట్ డిజైర్ కారులో బయల్దేరాడు. ఈ క్రమంలో పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65పై గల ఖమ్మం క్రాస్ రోడ్డు ఫైఓవర్‌పై ప్రయాణిస్తున్న డీసీఎం వ్యాన్‌ను అదుపుతప్పి వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. దాంతో మహ్మద్ నబీద్, నిఖిల్‌రెడ్డి, రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చందును చికిత్స కోసం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజశేఖర్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చందును మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మృతి చెందిన యువకుల భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహ్మద్ నబీద్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసించి ఉద్యోగం కోసం త్వరలో దుబాయ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

కోదాడ రూరల్, ఏప్రిల్ 12 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కోదాడ మండల పరిధి నల్లబండ గూడెం శివారు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు వాహన తనిఖీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. అంతకు ముందు కోదాడ పట్టణ పరిధి కోమరబండ శివారు వై జంక్షన్ వద్ద వాటర్ డే సందర్భంగా మొక్కలకు నీరు పోశారు. శివారు మిల్లులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ సాయాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

చింతలపాలెం, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని తమ్మవరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలకు, అసాంఘిక కార్యకలాపాలకు చోటివ్వకూడదన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామంలో సమస్యలు ఉత్పన్నమైతే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. డబ్బుకు, మద్యానికి ప్రలోభ పడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తమ్మవరం గ్రామంతో పాటు సమస్యాత్మక గ్రామాలైన నక్కగూడెం, కిష్టాపురం, పీక్లానాయక్‌తండాలో సాయుధ బలగాల సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ సైదిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీతో మహిళలకు స్వయం ఉపాధి

- గడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

గరిడేపల్లి, ఏప్రిల్ 12 : చిరుధాన్యాల ద్వారా పలు రకాల ఉత్పత్తులను తయారీ చేసి అమ్ముకోవడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని గడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై చేపట్టిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ ద్వారా మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. తదుపరి కేవీకే ఇన్‌చార్జి పీసీ డొంగరి నరేశ్ చిరుధాన్యాల ఉత్పత్తులను మార్కెట్ చేసుకునే విధానాలను వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు ఎన్.సుగంధి, ఎ.కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు

గరిడేపల్లి, ఏప్రిల్ 12 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఈ నెల 14న అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాల ధనుంజయనాయుడు బీసీ శ్రేణులను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అసమానతలు తొలగిపోవాలంటే తప్పక రిజర్వేషన్లు ఉండాలని అప్పుడే గొప్ప సమాజం తయారవుతుందని నమ్మి భారత రాజ్యాంగాన్ని రచించినట్లు తెలిపారు.

అంత ఘనత కలిగిన మహనీయుడి జయంతిని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్నదాత పడిగాపులు

- సింగారెడ్డిపాలెం ఐకేపీ ప్రారంభంపై వీడని సందిగ్ధం
- ఇప్పటికే రాశులుగా 5 వేల బస్తాలు
- కాంటాల కోసం ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

సింగారెడ్డిపాలెంలో సెంటర్ ప్రారంభించక పోవడంతో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 12 : కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేసి 12,500 క్వింటాళ్ల ధాన్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. అప్పటి నుంచి ఈ గ్రామంలో ఏడుసార్లు సెంటర్ నెలకొల్పడంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 72,350 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో రైతులకు సహకారం అందింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోళ్లకు ఈ నెల మొదటి వారంలో మచ్చుకు మండలంలోని ధర్మాపురం, అనాజీపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో అలాగే పీఏసీఎస్ ఆధ్వర్యంలో అనంతారం, పెన్‌పహాడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. తాజాగా సింగారెడ్డిపాలెం గ్రామంలో వరి ధాన్యం సాగు ఎక్కువగా ఉన్నదని తిరిగి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సంబంధిత సెర్ప్, రెవెన్యూ అధికారులకు పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. సంబంధిత అధికారులు వచ్చి గ్రామ రైతులు, మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. గ్రామ సంఘం పనితీరుపై చర్చ చేపట్టారు. ఐకేపీ కొనుగోలు, మహిళా సంఘాల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, గతంలో తీసుకున్న రుణ లావాదేవీలు, చెల్లింపుల విషయంలోనే కాదు ఇప్పటి వరకు వీఓఏ లేకపోవడంతో నూతన వీఓఏ ఏర్పాటు చేసుకున్నట్లు, దాంతో ధాన్యం కొనుగోలు ఏర్పాటుకు ఈ నెల 6న తీర్మానం జరిగినట్లు సంఘ బంధం రికార్డులో నమోదు చేశారు. దాంతో రైతులు తమ ధాన్యాన్ని తీసుకువచ్చి ఎప్పటిలాగే కొనుగోలు కేంద్రంలో రాశులుగా పోశారు. వారం రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించకపోవడంతో సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తే సెంటర్ ఇంకా అలాట్ కాలేదని, మండల సామాఖ్య తీర్మానం చేసి పంపామని.. సెంటర్ అలాట్ జిల్లా అధికారుల చేతిలో ఉన్నదని.. రేపు, మాపు ఓపెన్ అవుతుందని చెబుతూ వస్తున్నారు. దాంతో పూటకో మాట చెబుతున్నారని కొనుగోలు కేంద్రం అసలు ఉంటదా ? ఉండదా ? అనే సందిగ్ధంలో రైతులు పడిపోయారు. ఇప్పటికే 70 మంది రైతులు 5 వేల బస్తాల ధాన్యం తీసుకురాగా ఇంకా 10 వేల బస్తాలు వచ్చే అవకాశం ఉన్నదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఏపీఎం అజయ్‌నాయక్ స్పందిస్తూ.. సెంటర్ పర్యవేక్షణ చేయడానికి మండల సమాఖ్య కార్యాలయ సిబ్బంది సీసీ, ట్యాబ్ ఆపరేటర్, వీఓఏ తదితర పర్యవేక్షణ అధికారులు లేనందున సెంటర్ నిర్వహణ సాధ్యపడదన్నారు. ఈ విషయం డీఆర్‌డీఏకు లెటర్ పెట్టామని సిబ్బందిని అలాట్ చేస్తే సెంటర్‌ను నడపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సెంటర్ అలాట్ విషయంలో లెటర్ కూడా పెట్టామని ఇంకా తమకు ఉన్నతాధికారుల ఉత్తర్వులు అందలేదని పేర్కొన్నారు. వాతావరణంలో మార్పులు రావడంతో వర్షాలు వచ్చి ధాన్యం తడిసే అవకాశం ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సెంటర్ ఉంటుందనే ఆశతో..

నాకు సింగారెడ్డిపాలెంలో సొంతంగా 5 ఎకరాలు ఉండగా, కౌలుకు మరో 5 ఎకరాలు తీసుకుని దొడ్డు రకం వరి సాగు చేశా. తెలంగాణ వచ్చిన నాటినుంచి ఎప్పటిలాగే ధాన్యం కొనుగోలు సెంటర్ ఉంటదనే ఆశతో ధాన్యం తీసుకొచ్చా. ఇప్పుడేమో ఇంకా సెంటర్ ఓపెన్ కాలేదు. ఉరుములు, మెరుపులు, వర్షాలు వచ్చే కాలం అయింది. ఇక్కడ సెంటర్‌కు తీగలు లేవు. సెక్యూరిటీ లేదు. ఇల్లు ఆకిలి, భార్య పిల్లలను వదిలి రోజూ కాపలాకు రావాల్సి వస్తుంది. ఎవరికి చెప్పుకోవాలో తెలవడం లేదు. ఊళ్లో నాయకులు పట్టించుకోవడం లేదు. వేరే సెంటర్ తీసుకుపోవాలంటే మళ్లీ హమాలీ, ట్రాక్టర్ కిరాయి అవుతాయి. ఇక్కడ రైతులకు ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలే.

- కలంచర్ల నర్సయ్య, రైతు, సింగారెడ్డిపాలెం

చివరి గింజ వరకూ కొనుడు అంటే ఇదేనా ?

రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం దేవుడెరుగు. రైతు పండించిన పంట తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఐకేపీ ఏర్పాటుతో ప్రతి చివరి గింజ కొంటామన్న ప్రభుత్వ అర్థం ఇదేనా? ఈ ప్రభుత్వానికి రైతులు కష్టాలు తెలియడం లేదు. గత ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నపుడు చూశా. మళ్లీ అటువంటి దుర్భర పరిస్థితిని ఇప్పుడు చూస్తున్నా.

- పెద్దింటి సోమయ్య, రైతు, సింగారెడ్డిపాలెం

14న ఓటు అవగాహనపై 2కే రన్

నేరేడుచర్ల, ఏప్రిల్ 12 : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉదయం ఓటు అవగాహనపై 2కే రన్ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్వహించే ఈ ర్యాలీలో ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించొచ్చు

- మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు

చిలుకూరు, ఏప్రిల్ 12 : విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించవచ్చని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కళాశాలలో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఎంపికైన కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కళాశాల విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రీతిరెడ్డి, వైస్‌చైర్మన్ గౌతంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో ఆరుకు చేరిన మృతులు

- చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

మహేశ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 12 : ఈ నెల 4వ తేదీన 65వ జాతీయ రహదారిపై మానసనగర్ వద్ద ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడగా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో పరిస్థితి విషమించడంతో ఇటీవల కొలకోట్ల లావణ్య, గొలుసు మోక్షిత్ మృతిచెందారు. శుక్రవారం ఆటో డ్రైవర్ కంపసాటి మహేశ్ (27) చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మహేశ్ స్వగ్రామం అర్వపల్లి మండలం కాసర్లపాడు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

కోదాడ రూరల్, ఏప్రిల్ 12 : భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన పట్టణ పరిధి లక్ష్మీపురం కాలనీలో శుక్రవారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన నాగమణి (20)కి 8 నెలల క్రితం వివాహమైంది. ఆమె భర్త రామకృష్ణ రెండు నెలల కిత్రం గుండెపోటుతో చనిపోయాడు. భర్త మృతిని తట్టుకోలేని ఆమె మానసిక వేదనకు గురైనది. తల్లిదండ్రులు ఇంటిలో లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

సోదరి, స్థానికులు గమనించి చికిత్స కోసం కోదాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది.

నాగమణి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

గీత కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాలి

- గౌడ జన హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్

నూతనకల్, ఏప్రిల్ 12 : తెలంగాణ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అందిస్తున్న బీమాపై అవగాహన కల్పించాలని గౌడ జన హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీమా పొందడానికి కావాల్సిన అర్హతలు, ఎలా పొందాలనే విషయాలపై ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలని కోరారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మల్లయ్య, రామచంద్రు, ఉప్పులయ్య, శేఖర్, రమేశ్, వీరేషం పాల్గొన్నారు.

రెండ్రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 12 : ఈ నెల 14, 15 తేదీల్లో రెండ్రోజుల పాటు సూర్యాపేట జిల్లా కేంద్రంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట పట్టణానికి మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేసే పైప్‌లైన్ గరిడేపల్లి వద్ద లీకేజీ అయినందున దాని రిపేర్ దృష్ట్యా రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- అదనపు కలెక్టర్ ప్రియాంక

చివ్వెంల మండల కేంద్ర శివారులో సంపద వనాల మొక్కలకు నీళ్లు పెడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

చివ్వెంల, ఏప్రిల్ 12 : హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్ర శివారులో గల సంపద వనాల్లో నాటిన మొక్కలకు గ్రీన్ డే కార్యక్రమంలో భాగంగా ఆమె నీళ్లు పోసి మాట్లాడారు. వేసవి దృష్ట్యా మొక్కల సంరక్షణకు నిత్యం నీళ్లు అందించాలన్నారు. అనంతరం వట్టిఖమ్మంపహాడ్‌లో గల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం వీకేపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తేమ శాతం యంత్రంతో పాటు, ఐరిస్ యంత్రాన్ని పరిశీలించి రికార్డులు పరిశీలించారు. సూర్యాపేట రూరల్ మండలం ఇమాంపేటలో గల మిషన్ భగరీథ ప్లాంట్‌కు మరమ్మతుల కారణంగా చివ్వెంల మండలంలోని 19 గ్రామాలకు రెండు రోజుల పాటు ఆదివారం, సోమవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంపులు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నింపి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీరు అందించడంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గోపి, ఏపీఓ నాగయ్య, ఏపీఎం రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ యుగేంధర్, సంఘ బంధం అధ్యక్షురాలు పద్మ, పంచాయతీ కార్యదర్శి రషీద్, టీఏ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

మోతె : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక నిర్వాహకులకు సూచించారు. మండల పరిధిలోని మామిళ్లగూడెం, తుమ్మలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. తుమ్మలపల్లి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిర్వహిస్తున్న పనులు వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి, విద్యుత్ వంటి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సామగ్రి కూడా నాణ్యమైనది వినియోగించాలని పేర్కొన్నారు. తాసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్, ఎంఈఓ గోపాల్‌రావు, ఏఈ లింగయ్య, ఏఓ అరుణ, ఏపీఎం వెంకయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 12 : నేరేడుచర్ల పట్టణ, మండల సబ్ స్టేషన్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మండలంలోని దిర్శించర్ల, ముకుందాపురం, తెలగరామయ్యగూడెం సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల కింద చెట్ల కొమ్మలను తొలగించనున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గరిడేపల్లి : 33/11 కేవీ గరిడేపల్లి సబ్ స్టేషన్‌లో గల గరిడేపల్లి ఫీడర్ లైన్ల కింద గల చెట్ల కొమ్మలను తొలగించడం కోసం శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రావిరాల నగేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కల్మల్‌చెర్వు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లోని కల్మల్‌చెర్వు ఫీడర్ లైన్ల కింద సైతం చెట్ల కొమ్మల తొలగింపునకు ఉదయం 8 నుంచి 10:30 వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మేళ్లచెర్వు : మేళ్లచెర్వు, కందిబండ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ కింద చెట్ల కొమ్మలను తొలగించనున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పదేండ్ల తర్వాత మళ్లీ చేతి పంపులు

మండల కేంద్రంలో చేతి పంపును రిపేర్ చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

నూతనకల్, ఏప్రిల్ 12 : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గత పదేండ్లుగా వినియోగంలో లేకుండా పోయిన చేతి పంపులను రిపేర్ చేసి వినియోగంలోకి తెస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పడావు పడ్డ చేతి పంపును గ్రామ పంచాయతీ సిబ్బంది రిపేర్ చేశారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుదాం

- వేసవి నేపథ్యంలో పెరిగిన విద్యుత్ వాడకం
- అనవసర వినియోగాన్ని అరికడుదాం

నేరేడుచర్ల, ఏప్రిల్ 12 : ఎండ తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతున్నది. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడం కోసం ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను ఎక్కువ మొత్తంలో వాడుతుంటారు. దాంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగిపోతున్నది. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని ప్రభుత్వానికి అండగా నిలువాలి. నేటి విద్యుత్ ఆదా..రేపటి విద్యుత్ మిగులు నినాదంతో ముందుకెళ్లాల్సిన తరుణమిది. విద్యుత్ పొదుపు చేయడం వల్ల విద్యుత్ భారం తగ్గుతోంది. పొదుపు మంత్రం పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నది. విద్యుత్ వినియోగం ప్రధానంగా వ్యవసాయ, గృహావసరాలు, పారిశ్రామిక రంగాలకు పెద్ద మొత్తంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. గృహస్తులు, వ్యాపారస్తులు, రైతన్నలు పలు సూచనలు పాటిస్తూ విద్యుత్ దుబారాను అరికట్టడంతో పాటు ఆర్థిక భారం నుంచి తప్పించుకోవచ్చు. ఎండలు మండిపోవడంతో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నదని, గతంలో కంటే ఎండ తీవ్రత ముందుగానే మొదలైన నేపథ్యంలో గణనీయంగా విద్యుత్ వినియోగం పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా విద్యుత్ బిల్లు కూడా గతంలో కంటే అధికంగా వచ్చే అవకాశం ఉన్నది. బిల్లు తక్కువ నమోదు కోసం విద్యుత్ వినియోగదారులు పొదుపు మంత్రం పాటించాలని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యుత్ పొదుపు ఇలా :

- విద్యుత్ గృహోపకరణాలు కొనుగోలు చేసే సమయంలోనే మంచి పనితనం ఉన్న వాటికి ప్రాధాన్యత ఇవ్వాలి
- సాధారణ చల్లదనం కోసం సగటు ఉష్ణోగ్రత వద్ద ఏసీని సెట్ చేసుకోవాలి
- ఫిలమెంట్ బల్బులకు బదులుగా తక్కువ విద్యుత్‌తో ఎక్కువ వెలుగునిచ్చే ఎల్ఈడీ బల్బులను వాడడం వల్ల 60 శాతనికి పైగా విద్యుత్‌ను ఆదా చేయవచ్చు
- ఫ్రిజ్ డోర్లను రోజంతా పదే పదే తెరవకుండా వీలైనంత తక్కువ తెరవాలి
- వాషింగ్ మిషన్లలో బట్టలన్నీ ఒకేసారి ఉతకాలి
- కూలర్లు, ఫ్యాన్లు అవసరం మేరకే ఆన్‌లో ఉంచి బయటకు వెళ్లేటప్పుడు బంద్ చేయాలి
- వ్యవసాయ పంపుసెట్లను అవసర